క్లుప్తంగా

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: పీజీ హెచ్‌ఎంల పదోన్నతుల కలసాకారం చేసిన పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సలహాదారు నాగేశ్వరరావులను గురువారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించినట్టు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని అనిల్‌కుమార్, ముత్తినేని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డెస్క్ బల్లల వితరణ



బల్లలపై కూర్చున్న విద్యార్థులు

కూసుమంచి: మండలంలోని తురకగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రకాష్ ప్రాజెక్ట్స్ అధినేతలు డెస్క్ బల్లలు, గ్రీన్ బోర్డులను వితరణ అందజేశారు. వీటిని గురువారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాయల వీరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు బత్తినేని ప్రకాష్, స్వాతి, భీమవరపు పుల్లారావును అభినందించి సన్మానించారు.

పీఎం సహాయకుడినంటూ బీజేపీ నేతకు ఫోన్

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): ప్రజలను మోసం చేసేలా వస్తున్న ఫోన్లకు స్పందించవద్దని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు ఒక ప్రకటనలో కోరారు. గురువారం మధ్యాహ్నం తనకు ప్రధానమంత్రి వ్యక్తిగత సహాయకుడు తన్మయ్ మెహతాగా చెబుతూ +91 7236994318 నంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడని తెలిపారు. ఢిల్లీకి వచ్చి ప్రధానమంత్రిని కలవమని సూచించగా, ట్రూకాలర్ యాప్‌లో కూడా ఆ నంబర్ పీఎంఓగానే కనిపించిందన్నారు. అనుమానంతో తాను పీఎం కార్యాలయాన్ని సంప్రదిస్తే ఫేక్ కాల్‌గా తేలిందన్నారు. ఈవిషయమై సైబరాబాద్ సైబర్ క్రైం ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు వినోద్‌రావు వెల్లడించారు.

శంకుస్థాపన..

ఖమ్మంఅర్బన్: రాష్ట్రంలో మార్పు ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. బోడ శ్రావణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

భూతగాదాలో ఒకరిపై దాడి

ఖమ్మంఅర్బన్: భూతగాదా నేపథ్యాన ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఖమ్మంకు చెందని రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు వద్ద గుమస్తాగా పనిచేస్తున్న అంజయ్యపై తండ్రీకుమారులు రాజు, శీను గురువారం పదునైన ఆయుధాలతో దాడి చేసినట్టు తెలిసింది. నగరంలోని అల్లీపురం రోడ్డులో ఈ దాడి జరగగా బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	మహా అవతార్ నర్సింహా
సాయిరాం	మేఘాలు చెప్పిన ప్రేమకథ, పరదా
ఆదిత్య	స్టాలిన్, యూనివర్సిటీ
శ్రీనివాస	వార్-2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	48	బచ్చలికూర	4
వంకాయ	38		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	56	తోటకూర	4
దొండ	24		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		25
చామగడ్డ	34	పుదీన	1
క్యారెట్	48		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

కంటి మీద కునుకులేకుండా..

భయం గుప్పిట్లో రాజీవ్‌గృహకల్ప వాసులు

- శిథిలావస్థలో నివాస అపార్ట్‌మెంట్లు
- ఎప్పుడు కూలుతాయోననే ఆందోళన
- కొత్త ఇళ్లు నిర్మించాలని డిమాండ్



మూడో ఫ్లోర్‌లో పెచ్చులూడిన గోడలు

ఖమ్మంరూరల్: ఇప్పటికే మూడుసార్లు నివాస గృహాల్లోకి వచ్చిన వరద నీరు.. మళ్లీ ఏ అర్ధరాత్రి వరద విరుచుకుపడుతుందో తెలియని భయానక పరిస్థితిలో మండలంలోని పోలేపల్లి పరిధిలోని రాజీవ్‌గృహకల్ప వాసులు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో 2005లో ఎనిమిది పాట్లలో 748 నివాస గృహాలను నిర్మించి అర్హులైన పేదలకు పంపిణీ చేశారు. ఎనిమిదేళ్ల నుంచి మొన్నటి వరకు మూడుసార్లు మున్నేరు వరద వచ్చి వారిని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. గతేడాది సెప్టెంబర్1న వచ్చిన వరద రెండో ఫ్లోర్ వరకు వచ్చింది. దీంతో ఇంట్లో వస్తు సామగ్రి మొత్తం కొట్టుకుపోయాయి. ఇప్పుడు కూడా వరద రోజుకొకసారి వస్తున్న వరదను చూసి ఎప్పుడు ఇళ్లను ముంచెత్తుతుందోనని కంటిమీద కునుకులేకుండా గడుపుతున్నారు.

పెచ్చులూడిన గోడలు.. చువ్వలు తేలిన స్లాబ్‌లు

21 ఏళ్ల క్రితం నిర్మించిన అపార్ట్‌మెంట్లలోని గృహాలు దాదాపు శిథిలావస్థలోకి చేరి ఎప్పుడు కూలతాయోననే ఆందోళనలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ గతేడాది వరద రెండు ఫ్లోర్ల వరకు రావడంతో ఇప్పటికీ గోడలు పెచ్చులూడి పోయి దర్శనమిస్తున్నాయి. కేవలం పిల్లర్ల మీదనే అపార్ట్‌మెంట్లు నిలబడి ఉన్నాయి. ఇప్పటి వరకు నివాసగృహాలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గోడలు నెర్రెలు చాచి స్లాబ్‌ల నుండి ఇనుపచువ్వలు తేలియాడుతున్నాయి. మొన్నటి వరదకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న నిర్మాణాలు మొత్తం కూలిపోయాయి. వేలమంది నివాసముండే నివాసాలు ఎప్పుడు కూలిపోయి ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో తెలియక గృహవాసులు భయం భయంగా గడుపుతున్నారు. ఎప్పుడు, ఏక్షణం కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక తాము ఇక్కడ నివాసముండలేమని, వారందరికీరే చోట డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని కోరుతున్నారు. లేదంటే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రాజీవ్ స్వగృహలో ఇళ్లు కేటాయించాలని నివాసులు కోరుతున్నారు.

రక్షణ గోడ లేక అధిక నష్టం..

రాజీవ్‌గృహకల్ప నివాసాలు మున్నేటికి కొద్ది దూరంలోనే ఉండటం ఏటి పక్కన ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో వరదతాకిడికి నష్టం అధికంగా జరిగింది. గతంలో వచ్చిన వరదలు కేవలం నివాస గృహాలకు కొద్ది దూరం వరకే వచ్చి ఆగిపోయింది. కానీ గతేడాది వచ్చిన వరద ఏకంగా గృహాల్లోని రెండో ఫ్లోర్ వరకు రావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వరద ప్రవాహం ఉదయం వచ్చింది కాబట్టి అప్రమత్తంగా ఉన్నామని, అదే రాత్రి సమయంలో వచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని, నాలుగు రోజుల క్రితం వచ్చిన వరద కూడా ఎలాంటి ఉపద్రవం తెస్తుందోనని కాలనీవాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అదే రక్షణ గోడ ఉంటే ఇంతటి నష్టం జరిగేది కాదని, ప్రభుత్వం ఇప్పటికైనా రక్షణ గోడ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు నుండి రక్షించాలని వారు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న గృహకల్ప నివాసాలు

భయంతో గడుపుతున్నాం..



శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఎప్పుడు కూలతాయో తెలియక భయం భయంగా కాలం గడుపుతున్నాం. అపార్ట్‌మెంట్లలోని ఇళ్లన్నీ నెర్రెలు చాచి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఆనాలుగు నెలలు కంటిమీద కునుకు లేకుండా వరద భయానికి వణికిపోతున్నాం.

– వందెపు సుజాత, రాజీవ్‌గృహకల్ప

విధిలేక ఉంటున్నాం..



ఇళ్లు నెర్రెలు చాచి కూలిపోయే భయంకర పరిస్థితిలో ఉన్నా విధిలేక ఇక్కడే ఉంటున్నాం. గృహాలు ఎప్పుడు కూలతాయోననే ఆందోళనలో బతుకీడుస్తున్నాం. పాలకులు మారినా ఏ ప్రభుత్వం కూడా శిథిలావస్థలో ఉన్న ఇళ్ల గురించి పట్టించుకోవడంలేదు. ఈప్రభుత్వమైనా తమకు డబుల్‌బెడ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– ఏనూటి పద్మ, రాజీవ్‌గృహకల్ప

రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం– డోర్నకల్ రోడ్డు తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట, దానవాయిగూడెం ఆటో డ్రైవర్లు గురువారం 59వ డివిజన్ దానవాయిగూడెం కాలని ఎస్‌ఎస్సీ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. వందలాది ఆటోలు, వాహనాలు నిలిపివేయడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ.. 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మొదలైన ఈ రోడ్డు రెండేళ్లయినా పూర్తి కాకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నామని, ఈ మార్గంలో రోడ్డు పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోందని, వర్షాకాలంలో మట్టి, గుంతల కారణంగా ప్రయాణం కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు.

120 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో 120మందికి రూ.43లక్షల విలువైన చెక్కులను మాజీ ఎమ్మెల్సీ బాలస్వామి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మాజీ ఎంపీపీ గోసు మధు, నాయకులు భూక్యా బాలాజీ, ఉమ్మినేని కృష్ణ, ఇమ్మడి తిరుపతిరావు, చెరుకుమల్లి రవి, మల్లెల నాగేశ్వరరావు, కన్నెబోయిన సీతారామయ్య, షేక్ మజీద్, గౌస్, ఉమర్, కాంపాటి వెంకన్న, మేడ వెంకట్రావు, ఏనుగు మహేష్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

ఖమ్మంవైద్యవిభాగం: యూరియా కొరత ఎదురు కాకుండా సరిపడా సరఫరా చేసి రైతుల ఇక్కట్లను తీర్చాలని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాని కొరత ఇప్పుడు రావడం గర్హనీయమన్నారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ప్రణాళికాయుతంగా వ్యవహరించడంతో ఇబ్బందులు రాలేదని, ఇప్పుడు ప్రభుత్వ తీరుతో ప్రతీ గ్రామంలో ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈమేరకు సరిపడా సరఫరా చేయడమే కాక వ్యాపారులు బ్లాక్ చేయకుండా ప్రభుత్వం, అధికారులు పర్యవేక్షించాలని నామా ఒక ప్రకటనలో సూచించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి డాక్టరేట్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం బోగంకుంట బజార్‌కు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎంఏ రషీద్ డాక్టరేట్ అందుకున్నారు. ఇటీవల జరిగిన ఓయూ స్నాతకోత్సవంలో ఆయన ఇస్రో చైర్మన్ నారాయణన్ నుంచి డాక్టరేట్ స్వీకరించారు. ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకుంటూనే 'శారీరక విద్య' అంశంపై పరిశోధనాత్మక పత్రం సమర్పించిన రషీద్‌కు డాక్టరేట్ లభించింది. ఆయనను వివిధ సంఘాల బాధ్యులు హఫీజ్, మహ్మద్ జువ్వాద్ తదితరులు అభినందించారు.

మాస్‌లైన్ నగర కార్యదర్శిగా శోభ



ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం నగర కార్యదర్శిగా ప్రతాపనేని శోభారాణి నియమితులయ్యారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా శోభ, సహాయ కార్యదర్శిగా బల్లెపల్లి వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు. అనంతరం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ నగరంలోని ప్రజా సమస్యలపై మాస్‌లైన్ నిరంతర పోరాటాలు సాగిస్తోందని తెలిపారు.

సోమలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్ గుట్టపై శ్రీగిరి పర్వతంపై వెలిసిన స్వయంభు శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ సోమలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. జగద్గురు శ్రీ వేమనారాధ్య పీఠాధిపతి శ్రీ పూర్ణానంద స్వామి సమక్షాన ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజన కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. శుక్రవారం పూజలు, హోమాలు, మంగళహారతులతో వేడుకలు కొనసాగనున్నాయని నిర్వాహకులు రాంబాబు తెలిపారు.



అన్నప్రసాదం అందజేస్తున్న దృశ్యం

ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, పూజలు నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివాలయంలో కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: మాసశివరాత్రి సందర్భంగా గురువారం నగరంలోని ట్రంకురోడ్‌లో ఉన్న శ్రీ గుంటు మల్లన్న స్వామి దేవస్థానంలో శ్రీ భమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి కల్యాణం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్ర స్వామి, దాములూరి కృష్ణశర్మలు స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

పారదర్శకంగా పనులు పూర్తిచేయాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం పరిశీలించారు. డివిజన్‌లోని డ్రైయినేజీపై స్లాబ్ నిర్మాణ పనులను పరిశీలించి, కొలతల ప్రకారం నిర్మాణం జరిగిందా లేదా అని ఆరా తీశారు. నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో కొనసాగుతున్న పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనులు జరగాలని అధికారులకు సూచించారు.

కామేపల్లిలో యూరియా నిల్!



సొసైటీ ఎదుట ఎదురుచూస్తున్న రైతులు

కామేపల్లి: కొద్ది రోజులుగా మండలంలో రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ మేరకు కామేపల్లి పీఏసీఎస్‌లో రెండు రోజుల క్రితం యూరియా అయిపోవడంతో గురువారం కేవలం 225 బస్తాల యూరియా మాత్రమే వచ్చాయి. ఈ మేరకు వ్యవసాయాధికారులు పోలీసుల సహకారంతో రైతుకు ఒక్కటి చొప్పున 225 మంది రైతులకు కూపన్లు అందించిన తరువాత యూరియా విక్రయించారు. దీంతో పలువురు రైతులు గంటల తరబడి వేచిచూసి యూరియా అందక వెనుదిరిగారు. కొండాయిగూడెం పీఏసీఎస్‌లో యూరియా నిల్వలేకపోవడంతో మండల వ్యాప్తంగా యూరియా అందుబాటులో లేకుండా పోయింది.

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



రఘునాథపాలెంలో..



తిరుమలాయపాలెంలో..

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): నగరంలో పారిశుద్ధ్య పనులు సత్వరం చేసి, డెంగీ, మలేరియా, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నగరంలోని డ్రెయినేజీలు, రోడ్ల మరమ్మతులు, పూర్తిస్థాయిలో చేయకపోవడంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వం ఖమ్మం మున్సిపాలిటీపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిరోమణి, శ్రీనివాస్, అజాద్, శోభా, వెంకటేష్, సత్తార్‌మియా, లెనిన్, జాస్మిన్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని ప్రతీ గ్రామంలో బ్లీచింగ్ చల్లి, మురికికాల్వలను శుభ్రం చేసి పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కేలోతూ లక్ష్మణ్ మాట్లాడుతూ... తక్షణమే పంచాయతీలకు నిధులు కేటాయించి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేలోతూ పాపారావు, ధరావత్ లక్ష్మణ్, జరపల దేవల నాయక్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోతు ప్రేమ్‌సింగ్, గుగులోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టిసారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పంచాయతీల్లో పాలన కరువై నిధుల లేమితో పారిశుద్ధ్యం గాడితప్పిందని వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, పులిగుజ్జు వెంకటస్వామి, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఆరెంపుల వెంకన్న, బానోతు శంకర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం అర్బన్: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ ఖమ్మం అర్బన్ మండలాధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి బి.రవికిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం పేరుతో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే ధర్నాకు సీపీఎస్ రద్దు కోరే ప్రతీ ఉద్యోగి, భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల సమ్మె చేసిన కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు సమ్మె కాలానికి వేతనాలు మంజూరు చేయాలని, గురుకులాల టైమ్‌టేబుల్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఏ.దర్గయ్య, సత్యనారాయణ, ఎం.రంగారావు, ఎం.అచ్యుతరావు, కె.వెంకటకుమారి, జీవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నమ్మాలి.. ఇది మేజర్ కాల్వే..

- లకారం ట్యాంక్‌బండ్‌కు సాఫీగా సాగని నీరు
- అడుగడుగునా ఎదురవుతున్న అవాంతరాలు



కాల్వలో పేరుకుపోయిన కంపచెట్లు, చెత్తాచెదారం





ట్యాంక్‌బండ్‌కు నీరు అందించే మేజర్ కాల్వ పరిధి సీసీ కాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర బ్యూటిఫికేషన్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లకారం ట్యాంక్‌బండ్‌కు సాగర్ కాలువ నుంచి వచ్చే నీరు కలుషితమవుతోంది. సుమారు 2.2 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మేజర్ కాల్వ చైతన్యనగర్ వరకు సీసీ వాల్స్ రూపంలో సుమారు 800 మీటర్ల వరకు నిర్మాణం చేయగా, ట్యాంక్ బండ్ సమీపంలో సుమారు 400 మీటర్ల మేర పైపులైన్ వేశారు. రెండింటికి మధ్యలో మిగతా భాగం మట్టి కాల్వగానే నివాసాల నడుమ ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నివాసాల మధ్య నుంచి వెళ్తున్న ఈ కాలువలో నీరు ముందుకు సక్రమంగా ప్రవహించకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతూ చెత్తాచెదారంతో కంపుమయంగా మారింది. ఆయా నివాసాల రహదార్లులోని వర్షం నీరు సైతం ఈకాలువలో కలిసి పోవడంతో కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కాల్వలో చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు నీటిపై తేలుతూ దుర్వాసన వ్యాప్తి చెందుతోంది.

ఆనవాళ్లు లేకుండాపోయి..

మమతారోడ్ నుంచి వరదయ్యనగర్ వరకు ఉన్న మట్టి కాల్వలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చెత్త పేరుకుపోవడంతోపాటు కంపచెట్లు అల్లుకుని కాల్వ ఆనవాళ్లు లేకుండాపోయి నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో సాగర్ నుంచి వచ్చే నీరు కలుషితమై లకారం ట్యాంక్‌బండ్‌లో నిల్వ అవుతుంది. కాల్వ ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు కాల్వలో నీరు నిలిచి ఉండటంతో దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద కాల్వ ముగింపులో పైపుల సైజు తగ్గించి వేయడంతో సాగర్ నీరు సరఫరాలో కూడా ఇబ్బంది తలెత్తుందని, ప్రధాన కాల్వనుండి నీరు వదిలినా ఆ స్థాయిలో నీరు ట్యాంక్‌బండ్‌లోకి చేరడం లేదని అధికారులు భావిస్తున్నారు. శుభ్రం చేయాల్సిన కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో పేరుకే కాల్వగా ఉందంటున్నారు. 4 అడుగుల వైశాలంతో ఉన్న పైపులైన్ ద్వారా ట్యాంక్ బండ్‌లోకి 1 అడుగు వైశాలంలో నీరు రావడంలేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అందరికి ఉపయోగపడే ట్యాంక్ బండ్‌కు నీరందించే మేజర్ కాల్వను కంపుమయం నుండి కాపాడటంతోపాటు, నీరు సులభంగా ట్యాంక్‌బండ్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లకారం ట్యాంక్‌బండ్ అందాన్ని కాపాడాలంటే కాల్వను అభివృద్ధి చేయడంతోపాటు సాగర్ నీరు సక్రమంగా సాగేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు సూచిస్తున్నారు.